
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 23 । మే । 2025



సుఖీభవ లబ్ధిదారుల నమోదు

నూజెండ్ల: రైతుసేవా కేంద్రంలో గురువారం అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల నమోదు చేపట్టారు. ఇప్పటివరకు 13,175 మంది వివరాలు నమోదు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం గురువారం 512.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,459 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కొనసాగిన సదరం క్యాంప్

తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునః పరిశీలనలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కూడా కొనసాగింది.

న్యూస్‌రీల్

5న 'చలో విజయవాడ' కార్యక్రమం



మంగళగిరి: జూన్ 5వ తేదీన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీజీ ఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు విజయవంతం చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సంఘానికి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, మంగళగిరి తాలూకా యూనిట్ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి మాధవరావు, ఉపాధ్యక్షురాలు సుభాషిణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటి సంరక్షించాలి



కాజ (మంగళగిరి): ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కాజలో గురువారం ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మెప్మా డైరెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు, మహిళా సంఘాలు సభ్యులు తొలుత కనీసం ఒక్క మొక్క నాటి దానిని సంరక్షించాలని కోరారు. మొక్కలు నాటడంపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహిళలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల, మెప్మా పి.డి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజే విద్యామిత్ర కిట్లు అందిస్తాం



ప్రత్తిపాడు: పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందించడం జరుగుతుందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఐ. పద్మావతి అన్నారు. ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మండల స్థాయి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను గురువారం ఏపీసీ పరిశీలించారు. క్వాలిటీ వాల్‌తోపాటు బ్యాగుల నాణ్యతను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన కిట్లు అందించడం జరుగుతుందన్నారు. వెంట ఎంఈవో-2 జి. లీలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇకపై వజ్ర కిరీటంతో దుర్గమ్మ దర్శనం

ప్రతి పౌర్ణమి రోజున అలంకరించాలన్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రతి పౌర్ణమిన అమ్మవారికి స్వర్ణకవచంతో పాటు వజ్ర కిరీటాన్ని అలంకరించాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆలయ వైదిక కమిటీకి సూచించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన వైదిక కమిటీ, ముఖ్య అర్చకులతో ఈవో శీనానాయక్ గురువారం సమావేశమయ్యారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి వైదిక కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, మల్లేశ్వర శాస్త్రి, సుందరంబాబులతో పాటు ఇతర అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడుతూ అమ్మవారి సన్నిధిలో జరిగే వైదిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించాలని, నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించాలని సూచించారు. దేవతామూర్తుల అలంకరణ, వస్త్రాలు వైభవంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవి కుమార్, ముఖ్య అర్చకులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఏఈవోలు పాల్గొన్నారు.

తమ్ముళ్ల పేకాట



కాయ్ రాజా కాయ్... అంటూ జిల్లాలో మళ్లీ పేకాట శిబిరాలు తెరుచుకున్నాయి. గుంటూరు నగరం నడిబొడ్డున ఉన్న ఎల్‌వీఆర్ క్లబ్, గుంటూరు క్లబ్‌లు కేంద్రాలుగా మారిపోయాయి. వీటితోపాటు పలు లాడ్జీలలో పేకాట యథేచ్ఛగా సాగుతోంది. తమ్ముళ్లు తమ జేబులు నింపుకొంటూనే ఆయా అధికారులకు మామూళ్లు ఇస్తున్నారు. ఆ మత్తులో అధికారులు కనీసం తనిఖీల ఊసు కూడా ఎత్తడం లేదు.

– సాక్షి ప్రతినిధి, గుంటూరు

మామూళ్లు ఇచ్చి మరీ జేబులు నింపుకొంటున్న టీడీపీ నేతలు

- ఎల్‌వీఆర్ క్లబ్, గుంటూరు క్లబ్‌లలో మళ్లీ షురూ
- తాత్కాలిక సభ్యత్వాలు.. రూ. లక్షల్లో పందేలు
- పేకాట స్థావరాలుగా మారిన నగరంలోని లాడ్జీలు
- తూతూ మంత్రంగా పోలీసుల దాడులు
- క్లబ్బుల వైపు కన్నెత్తి చూడని అధికారులు

నగరం మధ్యలో ఉన్న ఎల్‌వీఆర్ క్లబ్‌లో రూ.2 వేల నుంచి రూ.లక్ష వరకు పందేలతో పేకాట నడుస్తోంది. రూ.లక్షకు 500 పాయింట్లు ఇస్తారు. ఒక్కో పాయింట్ విలువ రూ.200 ఉంటుంది. డ్రాప్‌నకు రూ.5 వేలు, కౌంట్‌కు రూ.40 వేల వరకు ఆడుతున్నారు. నెల క్రితం వరకు సభ్యులకు మాత్రమే అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ఎవరొచ్చినా తాత్కాలిక సభ్యత్వాలు ఇస్తూ వారితోనూ ఆడిస్తున్నారు. 100 నుంచి 200 మంది వరకు తాత్కాలిక సభ్యత్వాలు తీసుకున్నట్లు సమాచారం. రూ.లక్ష, రూ.50 వేలు, రూ.20 వేల టేబుళ్లు ఐదు చొప్పున ఇక్కడ ఉన్నట్టు తెలిసింది. రూ.10 వేలవి 10 వరకు క్లబ్‌లో నడుస్తున్నాయి.

- పలకలూరు రోడ్‌లో ఉన్న గుంటూరు క్లబ్‌లో ఏకంగా రూ.2 లక్షల ఆటలు కూడా నడుస్తున్నాయి. ఇక్కడ కూడా ఎవరు వచ్చినా తాత్కాలిక సభ్యత్వం ఇచ్చి ఆడిస్తున్నారు.
- మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి పరిధిలో ఉన్న విజయవాడ క్లబ్‌లో రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ఆటలు నడుస్తున్నాయి. అనుబంధ సభ్యుల పేరుతో ఇతరులను కూడా ఆడిస్తున్నారు.
- చిలకలూరిపేట క్లబ్‌లో కూడా రూ.50 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల ఆటలు ఆడిస్తున్నారు. ఇతర జూదాలు కూడా నడుస్తున్నాయి.
- ఇవన్నీ అధికార టీడీపీ నాయకులు తమ కనుసన్నల్లో నడిపిస్తున్నారు. దీనికి అగ్ర నాయకత్వం ఆమోదం ఉందని బయటకు చెబుతుండటంతో పోలీసులు కూడా అటు వైపు కన్నెత్తి చూడటం లేదు.

లాడ్జీలలోనూ యథేచ్ఛగా...

నగరంలో సుమారుగా 80 నుంచి 100 వరకు లాడ్జీలు ఉన్నాయి. వీటిలో కూటమి నేతల అండదండలతో పేకాట మాత్రమే కాదు... వ్యభిచారం కూడా జోరుగా జరుగుతోంది. రెండు గదులున్న చోట ఒక గదికి బయట వైపు తాళం వేసి రెండో గదిలో పేకాట ఆడిస్తున్నారు. రోజుకు రూ.15 వేల నుంచి రూ. 25 వేల వరకు బంకిని తీస్తున్నారని తెలుస్తోంది. రాజా గారి తోట, గుంటూరు వారి తోట, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలతోపాటు అరండల్ పేట ఒకటో లైను, పట్టాభిపురంలోని పలు గెస్ట్ హౌస్‌లలో కూడా పేకాట విచ్చలవిడిగా సాగుతోంది.

నెలవారీగా రూ.లక్షలు

లాడ్జీల నుంచి స్టేషన్లకు కేవలం తూర్పు నియోజకవర్గ పరిధిలోనే నెలకు రూ. ఐదు లక్షలపైగా అందుతోందని సమాచారం. పశ్చిమ పరిధిలో కూడా సుమారు రూ. నాలుగు లక్షల వరకు ఇస్తున్నారు. ఈ వసూళ్లలో ఐడీ పార్టీ (మఫ్టీ పార్టీ) కానిస్టేబుళ్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. తెలుగుదేశం నేతలు చెప్పిన విధంగా అక్కడక్కడ దాడులు నిర్వహించి లాడ్జి యజమానులను బెదిరింపులు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ నేతల వసూళ్ల పర్వం



లాడ్జీల అసోసియేషన్‌కి సంబంధించి పలు వివాదాలు కూడా నడుస్తున్నాయి. కూటమికి సంబంధించిన ఒక నేత అసోసియేషన్‌ను తానే నడిపిస్తానని, నెలకి రూ.15, 000 చొప్పున ప్రతి లాడ్జి వారు ఇవ్వాలని నిర్వాహకులను ఇబ్బందులు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లకు రూ.9 వేల చొప్పున కేటాయించినట్లు సమాచారం. మిగతా రూ.6 వేలను కూటమి నేతలు తీసుకునేందుకు ప్రణాళిక ప్రకారం ప్రజా ప్రతినిధులతో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు.



గుంటూరు కొరిటెపాడు కల్యాణ రామచంద్ర ఆలయంలో బంగారు తాపడంతో హనుమాన్



తెనాలి శ్రీకోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయుడు

హనుమా.. దయతో కనుమా...

హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముడికి పరమ భక్తుడైన ఆంజనేయుడు ధైర్యం, బలం, భక్తి, జ్ఞానం, వినయం వంటి సుగుణాల సాక్షాత్కారంగా భావిస్తారు. భయాలు తొలగించడంతోపాటు శక్తి, ధైర్యం పెంచాలని కాంక్షిస్తూ భక్తులు ఉపవాసం ఉండి, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారాలు విశేషంగా సాగాయి. –నెట్‌వర్క్



తెనాలిలోని మారీసుపేటలో ఉన్న శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్ర మౌళేశ్వరస్వామి దేవస్థానంలోని వీరాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భాస్కరా...తీరు మారదా!

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే టార్గెట్‌గా అక్రమ కేసులు, వేధింపులు
- ఇప్పటికే సీఐ తీరుపై కోర్టును ఆశ్రయించిన బాధితులు
- టీడీపీ నేతల ఆదేశాలతో బీసీ యువకుడు హరికృష్ణపై అక్రమ కేసు
- థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో నడవలేని స్థితిలో ఉన్న కుమారుడిని చూసి చలించిన తల్లిదండ్రులు
- సీఐ భాస్కర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పురుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానంటున్న హరికృష్ణ తల్లి అంకమ్మ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. కూటమి నేతల వద్ద మెప్పు కోసం పోలీసులమన్న భావనను పక్కన పెట్టి విపక్ష నేతలను టార్గెట్ చేస్తున్నారు. వరుస వెంబడి జరుగుతున్న అక్రమ అరెస్టులతో రాష్ట్రం అట్టుడుకిపోతుంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలు, అరాచకాలను ప్రశ్నిస్తే గొంతులను నులిమేస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కొందరు వ్యవస్థపై ప్రజలకు గౌరవం లేకుండా చేస్తోంది. దాచేపల్లి పోలీసుల తీరు రోజురోజుకు వివాదాస్పదమౌతున్నది. ప్రధానంగా దాచేపల్లి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న పి.భాస్కర్ రెడ్‌బుక్ కోసమే ఉద్యోగం చేస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భాస్కర్ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు పెట్టి జైలు పాలు చేసిన ఘనుడు. అక్రమ అరెస్టులపై ప్రశ్నించే వారిని పోలీస్‌స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకున్న ఈ బేడీల భాస్కర్ ఆగడాలపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారో అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.

పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు

– ఉప్పుతోళ్ల హరికృష్ణ

గురజాల: దాచేపల్లి పోలీసులు తనను చిత్రహింసలకు గురిచేసినట్లు జడ్జి ముందు ఉప్పుతోళ్ల హరికృష్ణ వాగ్మూలం ఇచ్చినట్లు ఆయన తరుపు న్యాయవాది కిరణ్ దాసు తెలిపారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల హరికృష్ణను దాచేపల్లి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని, రాత్రి 6 గంటలకు జడ్జి ముందు హాజరుపరిచారు. ఉప్పుతోళ్ల హరికృష్ణ మాట్లాడుతూ దాచేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కాళ్లపై, చేతులపై కర్రలతో కొట్టారని, సీఐ భాస్కరరావు చిత్రహింసలకు గురిచేశారని న్యాయమూర్తి ముందు వాపోయాడు. హరికృష్ణ ఇచ్చిన వాగ్మూలం రికార్డు చేసిన న్యాయమూర్తి వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు న్యాయవాది తెలిపారు. 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.

నడవలేని స్థితిలో హరికృష్ణ

వైఎస్సార్ సీపీ కార్యకర్త హరికృష్ణని దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లోని సీఐ క్వార్టర్‌లో ఉంచారు. హరికృష్ణపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్టు తెలుస్తోంది. తంగెడ నుంచి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కి చేరుకోగా నడవలేని స్థితిలో సీఐ క్వార్టర్‌లో పడి ఉన్న కుమారుడిని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. జరిగిన అన్యాయంపై మాట్లాడేందుకు కుటుంబసభ్యులు స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. క్వార్టర్‌లో ఉన్న తమ కుమారుడిని చూపించాలని అక్కడకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ నేతలతోపాటుగా హరికృష్ణ తల్లిదండ్రులు కోరారు. దీనికి పోలీసులు అంగీకరించలేదు. క్వార్టర్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.



హరికృష్ణ కోసం టీడీపీ నేత జానీబాషా కారులో వచ్చిన పోలీసులు



హరికృష్ణని అక్రమ నిర్బంధించిన సీఐ క్వార్టర్ వద్ద వైఎస్సార్ సీపీ నేతలు

బీసీ యువకుడిపై ప్రతాపం

టీడీపీ అధికారంలోకి రావడంతో తంగెడ గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల యల్లయ్య, కుమారుడు హరికృష్ణలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తుండటంతో తెలంగాణ వెళ్లి డ్రైవర్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో జరిగే పండుగకు వచ్చిన బీసీ యువకుడు హరికృష్ణపై టీడీపీ నేత షేక్ జానీ బాషా తన అనుయుడితో చెప్పించిన కట్టుకథతో పోలీసులు గురువారం కేసు కట్టారని హరికృష్ణ కుటుంబసభ్యులు వాపోతున్నారు. పోలీసు వాహనంలో కాకుండా టీడీపీ నేత కారులో వచ్చి తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. దాని ఆధారంగానే హరికృష్ణను చిత్రహింసలకు గురిచేశారని వాపోతున్నారు. ఎన్నికల రోజున జరిగిన గొడవలో హరికృష్ణపై కేసు నమోదు చేసి పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఆ గొడవకు సంబంధించి టీడీపీ వారికి రూ.40లక్షలు చెల్లించాలని సీఐ భాస్కర్ నేరుగా పంచాయితీ చేశాడు. టీడీపీ నేత జానీబాషా రూ.40లక్షలు ఇస్తేనే కేసులు రాజీకి వస్తామని ఒత్తిడి చేశారు. ఈ కేసులో ఉన్న వైఎస్సార్ సీపీ నేతలను ప్రతి రోజూ స్టేషన్‌కి పిలిపించి ఇబ్బంది పెట్టారు. సీఐ తీరుతో వైఎస్సార్ సీపీ నేతలు విసుగు చెంది కోర్టుని ఆశ్రయించారు. కోర్టు సైతం సీఐ భాస్కర్ తీరుని తప్పుపట్టింది. తంగెడకి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు దేవళ్ల వీరాస్వామి, గొగిరెడ్డి వెంకటరెడ్డి, వట్టి రామచంద్రారెడ్డితో పాటుగా మరికొందరిపై రకరకాలుగా కేసులతో సీఐ వేధించాడని వారు వాపోతున్నారు.

నా భర్తకి ఏమైనా జరిగితే మాకు దిక్కెవరు?



నా భర్త హరికృష్ణ ఏ తప్పు చేశాడని పోలీస్‌స్టేషన్‌కి తీసుకువచ్చారు. టీడీపీ నాయకుడు జానీబాషా చెప్పడని నా భర్తని తెచ్చామని పోలీసులు మాతో అన్నారు. జానీబాషా కారులోనే నా భర్తని తెచ్చారు. నాకు ముగ్గురు పిల్లలు. నాకు తల్లిదండ్రులు కూడా లేరు. నా భర్తకు పోలీసులు, టీడీపీ నాయకుల వలన ఏమైనా జరిగితే నేను, నా పిల్లలు విషం తాగి చచ్చిపోతాం. నా భర్త నోట్లో గుడ్డలు పెట్టి పోలీసులు కొట్టారు.

–ఉప్పుతోళ్ల భార్గవి, హరికృష్ణ భార్య

దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారు



నేను, నా కుమారుడు హరికృష్ణ టిప్పర్లకు డ్రైవర్లుగా పనిచేసుకుంటూ తెలంగాణలో ఉంటున్నాం. పండక్కి ఇంటికి వస్తే పోలీసులు మా ఇంటికి వచ్చి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఏ కారణం లేకుండా నా బిడ్డని పోలీసులు దౌర్జన్యంగా అదుపులోకి తీసుకుని తప్పుడు కేసు పెట్టి చిత్రహింసలు పెట్టారు. పోలీసులు రాజ్యాంగం అమలు చేయకుండా టీడీపీ నాయకులు చెప్పిందే చేస్తున్నారు. ఇలాంటి తప్పుడు కేసులు పెట్టి మమ్మల్ని అంతమొందించాలని చూస్తున్నారు.

–ఉప్పుతోళ్ల యల్లయ్య, హరికృష్ణ తండ్రి

చట్టం ముందు నిలబెడతాం...



బీసీ వర్గానికి చెందిన హరికృష్ణను టీడీపీ నేతల ప్రోద్బలంతో పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. దాచేపల్లి సీఐ భాస్కర్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో ఉద్రిక్తతలు నెలకొనేలా చేస్తున్నాడు. సీఐ తీరుపై కోర్టులో న్యాయపోరాటం చేసి చట్టం ముందు నిలబెడతాం. హరికృష్ణ కుటుంబానికి అండగా నిలుస్తాం.

–కాసు మహేష్‌రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే

మరింత రెచ్చిపోతున్నాడు...



దాచేపల్లి సీఐ తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పోలీసుస్టేషన్‌కు బేడీలు వేసి అప్రతిష్టపాలైనా ప్రభుత్వం సీఐపై చర్యలు తీసుకోకపోవడం వల్ల మరింత రెచ్చిపోతున్నాడు. సీఐపై చర్యలు తీసుకోకపోతే వైఎస్సార్ సీపీ తరపున రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు చేపడతాం. ఎస్పీ ఆదేశాలతోనే కొట్టానని చెబుతున్నాడు. అది నిజం కాకపోతే సీఐపై చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్య విభాగం అధికార ప్రతినిధి

సమావేశాలతో మమ అనిపించారు

- అర్ధరాత్రి మద్యం అమ్మకాలపై చర్యలు శూన్యం
- ప్రజారోగ్యం దెబ్బతింటున్నా యంత్రాంగంలో అదే నిర్లక్ష్యం

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: గుంటూరు నగరంలో అర్ధరాత్రి పూట మద్యం విక్రయాలపై 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన 'నిశీధిలోనూ అదే నిషా' కథనానికి అధికారులు స్పందించారు. బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మద్యం విక్రయాలపై చర్చించారు. అయితే ఇప్పటి వరకు అర్ధరాత్రి పూట మద్యం అమ్మకాలు చేపట్టిన దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం కాలక్షేపంగా సమావేశం నిర్వహించి, జాగ్రత్త పడాలంటూ అధికారులే సూచనలు చేశారని విమర్శలు వస్తున్నాయి. స్పష్టంగా సాక్ష్యాధారాలతో 'సాక్షి'తో కథనం ప్రచురితమైనప్పటికీ అధికారులు నోటి మాటలతోనే సరిపెట్టారు. అర్ధరాత్రి వేళ అమ్మకాలు జరిగినా బార్ అండ్ రెస్టారెంట్‌లపై కనీస నిబంధనల ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతోపాటు పోలీసులు సైతం సమావేశం ఏర్పాటు చేసి యాక్షన్ తీసుకుంటామని 'యాక్షన్' చేశారు తప్ప, ఎటువంటి చర్యలు చేపట్టలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆచరణలోకి రాని మాటలు

ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారుగానీ, ఏడాది కాలంలో ఏ ఒక్కరోజూ ఇది అమలు కాలేదు. గతంలో సైతం బహిరంగ మద్యపానం, ఎమ్మార్పీ ధరలు, అర్ధరాత్రి అమ్మకాల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు చేపడతామని చెప్పారేగానీ, చేతల్లో మాత్రం ఆ విషయం చూపలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం మాట అటుంచితే.. అధికారులకు వారే కొన్ని వినతులు ఇచ్చినట్లు తెలిసింది. తమకు మూడు నెలలు మాత్రమే వ్యవధి ఉందని, అధికారులకు అన్ని విధాలా సహాయంగానే ఉంటున్నామని నిర్వాహకులు గుర్తుచేశారు. ప్రతినెలా మామూళ్లు చెల్లిస్తున్నామని, చూసీచూడనట్లు పోవాలని కూడా ఎక్సైజ్, పోలీసు అధికారులకు వ్యాపారులు విన్నవించినట్లు సమాచారం. దీంతో వారికి అధికారులు ఉపాయాలు కూడా చెప్పారు. కొద్దిరోజులపాటు పేరుకు తాము తనిఖీలు నిర్వహిస్తామని చెప్పినట్లు తెలిసింది. ఆ సమయంలో ప్రభుత్వం విధించిన నియమాలు పాటించాలని, తర్వాత ఇవేమీ ఉండబోవని వ్యాపారులకు పోలీసు అధికారులు సూచించినట్లు తెలుస్తోంది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,500



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 903

కొమ్ములు : 662 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	11,750	10,550

కాయలు : 241 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	11,750	10,550

మొత్తం అమ్మకాలు : 677.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న వర్షాలు

ఫిరంగిపురంలో 80 మి.మీ. వర్షపాతం నమోదు

కొరిటిపాడు(గుంటూరు): కొనసాగుతున్న వర్షాలు చూస్తే ఈ సారి వానాకాలం ముందే వచ్చినట్లుంది. కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలోని 18 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఫిరంగిపురం మండలంలో అత్యధికంగా 80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా ప్రత్తిపాడు మండలంలో 14.8 మి.మీ. కురిసింది. సగటు 34.6 మి.మీ.గా నమోదైంది. మే నెల 22వ తేదీ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 44.2 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 140.8 మి.మీ. పడింది. తుళ్ళూరు మండలంలో 50.4, చేబ్రోలు 47.8, పెదకాకాని 42.2, గుంటూరు పశ్చిమ 40.4, తాడేపల్లి 35.6, మేడికొండూరు 32.8, పొన్నూరు 32.6, గుంటూరు తూర్పు 32.4, దుగ్గిరాల 29.6, తెనాలి 29, కొల్లిపర 28.4, మంగళగిరి 28.4, కాకుమాను 26.4, తాడికొండ 26.2, వట్టిచెరుకూరు 26.2, పెదనందిపాడు మండలంలో 20.4 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతుండటంతో ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. గరిష్ఠంగా 31 డిగ్రీల వరకు మాత్రమే నమోదవుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల రానున్న రెండు, మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

పీజీ వైద్యులకు పరిశోధనలపై దృష్టి ముఖ్యం

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి



వర్క్‌షాపులో పీజీ వైద్య విద్యార్థులతో బోధనా సిబ్బంది

గుంటూరు మెడికల్: పీజీ వైద్య విద్యార్థులు అకడమిక్ కార్యక్రమాలతోపాటు పరిశోధనలపై దృష్టి సారించడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. గుంటూరు మెడికల్ కాలేజీలో పీజీ వైద్య విద్యార్థుల కోసం రెండురోజుల పరిశోధన శిక్షణ శిబిరం గురువారం మొదలైంది. తొలి ఏడాది పీజీ వైద్య విద్యార్థులకు 'రీసెర్చ్ మెథడాలజీ – థీసిస్ ప్రిపరేషన్'పై కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ వైద్య విభాగాల నుంచి 180 మందికిపైగా పీజీ వైద్యులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సీతారామ మాట్లాడుతూ, పరిశోధన పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, గుణాత్మక థీసిస్ రూపొందించేందుకు వర్క్‌షాప్ ఉపయోగపడుతుందన్నారు. ముఖ్య అతిథిగా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణలు విద్యార్థులకు పరిశోధన పట్ల అవగాహనను పెంచడమే కాకుండా, మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయన్నారు. గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జయంతి, డాక్టర్ పి.అనిల్, పలువురు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తరగతులు నిర్వహించి, పీజీ విద్యార్థుల థీసిస్ ప్రోటోకాల్‌ను వివరించారు.

జిల్లా భద్రతా విభాగం పోలీసుల మాక్ డ్రిల్



డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడికొండ: తుళ్ళూరు మండలంలో భద్రతా పోలీసు విభాగం పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. తుళ్ళూరు డీఎస్పీ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో డీఎస్‌డబ్ల్యూ ఆర్ఐ సురేష్ కుమార్ సమక్షంలో గురువారం నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌లో భాగంగా భద్రతా విభాగం అధికారులు, సిబ్బంది తమ వద్ద ఉన్న అత్యాధునిక సాంకేతిక పరికరాలు, శిక్షణ పొందిన పోలీసు జాగిలాలతో సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం వరకు తనిఖీలు నిర్వహించారు. కచ్చితత్వాన్ని పరీక్షించి జాగిలాల పనితీరును అంచనా వేసేందుకు సీడ్ యాక్సిస్ రోడ్డులో ఓ చోట పేలుడు పదార్థం గోప్యంగా పెట్టారు. బాంబు డిస్పోజల్ విభాగానికి చెందిన జాగిలం దాన్ని కనిపెట్టింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు మాట్లాడుతూ.. వీవీఐపీలు ప్రయాణించే సీడ్ యాక్సిస్ రోడ్డులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తుళ్ళూరు డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ రోడ్డుపై ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి నిర్మాణ పనులకు వచ్చిన కార్మికుల వివరాలను సేకరిస్తున్నామని, భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుళ్ళూరు సీఐ కొంకా శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ఎస్పీ విభాగం శ్రీహరి, జిల్లా భద్రతా విభాగం ఆర్ఐ సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు యు. రాజశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... దరఖాస్తు ప్రక్రియతో ఎన్నో అంశాలు ముడి పడి ఉన్నాయని అన్నారు. ఉపాధ్యాయులు గతంలో టీఐఎస్‌లో స్వయంగా అప్‌లోడ్ చేసిన సమాచారమే ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంటుందని, దానిలో ఎటువంటి మార్పు ఉండబోదని చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ప్రత్యేక పాయింట్లు, రేషనలైజేషన్, ప్రిఫరెన్షియల్ పాయింట్లు ఇతర వివరాలను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు సబ్‌మిట్ చేసే ముందుగా పరిశీలన చేసుకోవాలని, దరఖాస్తు ప్రింటవుట్ రెండు కాపీలను డీఈవోకు సమర్పించాలని సూచించారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమైన తరువాత అదనంగా గంట బోధించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ బదిలీల చట్టం, ఉపాధ్యాయులకు పాయింట్ల కేటాయింపు, పాఠశాలల స్ట్రక్చర్ వెనుక యూటీఎఫ్ పోరాటం ఉందని తెలిపారు. సదస్సులో సంఘ నాయకులు జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ ఆదినారాయణ, కె. సాంబశివరావు, బి. రంగారావు, ఎం.గోవిందు, బి.ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, ఎం. చిన్నయ్య, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తాడికొండ: ఎస్టీ మహిళపై చేయి చేసుకొని, కులం పేరుతో దూషించిన వ్యవహారంలో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తుళ్ళూరు సీఐ కె. శ్రీనివాసరావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలోనిన టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న మేడా అంజమ్మ అనే మహిళ వర్షం కారణంగా వచ్చిన నీటిని ఊడ్చుతుండగా కింద ఫ్లోర్‌లో ఉన్న కుమారి వివాదానికి దిగింది. ఇద్దరి మధ్య వివాదం జరుగుతున్న సమయంలో కుమారి కుమారుడు ఆవేశంగా వచ్చి అంజమ్మపై దాడి చేశాడు. కులం పేరుతో దూషించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీలకు ఎస్టీయూ సేవలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించిన సేవల కోసం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంఘ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఉద్యోగోన్నతులు, బదిలీలు, రేషనలైజేషన్ తదితర సమస్యలకు పరిష్కారం తెలిపేందుకు విషయ నిపుణులు అందుబాటులో ఉండి, ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసేందుకు సహాయపడతారని తెలిపారు. సీనియర్ నాయకులు, సాంకేతిక నిపుణులు వై.శ్యాంబాబు, జె.వెంకటేశ్వరరావు, యు.మహంకాలరావు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్టీయూ భవన్‌లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తగిన సమాచారంతో హాజరై ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

గొడవర్రు(చేబ్రోలు): చేబ్రోలు మండలంలో రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. మండల పరిధిలోని గొడవర్రు గ్రామంలో బుధవారం రాత్రి పిడుగులు పడ్డాయి. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పుల్లా అంకమ్మ (54) పిడుగుపాటు ప్రభావానికి గురై మృతి చెందాడు. రెవెన్యూ అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. సంఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల కాపరి హత్య

వంద గొర్రెలను చోరీ చేసిన దుండగులు

కాకుమాను: గొర్రెల కాపరి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై పృథ్వీ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదనందిపాడు మండలం పుసులూరు గ్రామానికి చెందిన తలపల శ్రీనివాసరావు రోజు మాదిరిగానే బుధవారం కూడా గొర్రెలను మేపేందుకు కాకుమాను, పుసులూరు గ్రామాలలోని పంట పొలాల్లోకి తీసుకువెళ్లాడు. చీకటి పడినా శ్రీనివాసరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల పొలాల్లో వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో ఇంటికి వెళ్లారు. గురువారం పొలం పనులకు వెళ్లిన కూలీలు పంట కాలువలో వ్యక్తి మృతదేహం ఉండడం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ భానోదయ, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై పృథ్వీ ఏక్‌నాథ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంలో క్లూస్‌టీం సభ్యులు, క్రైం బ్యాచ్ సిబ్బంది వివరాలు నమోదు చేసుకున్నారు. శ్రీనివాసరావును హత్య చేసిన దుండగులు అతడు మేపుతున్న వంద గొర్రెలను కూడా చోరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. శ్రీనివాసరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

నరసరావుపేట టౌన్: భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్. సత్యశ్రీ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఈపూరు మండలం కూచనపల్లి గ్రామానికి చెందిన బొగ్గవరపు మేరీకి పిడుగురాళ్లకు చెందిన నాగరాజుతో 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఏళ్లు గడిచినా సంతానం కలగకపోవటంతో దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. భార్య మీద అనుమానం పెంచుకున్న భర్త 2023 ఏప్రియల్ 9వ తేదీన ఆమె దగ్గరకు వచ్చాడు. ఆ సమయంలో మేరీ పిండి వంటలు చేస్తుండగా గొడవపడి వేడి నూనెను ఆమెపై పోశాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ న్యాయమూర్తికి వాంగ్మూలం ఇచ్చి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు ఈపూరు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

అర్హులైన వైద్యులనే గర్భిణులు సంప్రదించాలి

పల్నాడు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి



నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని గర్భిణులు, బాలింతలు వైద్య సేవలకు అర్హులైన వైద్యులనే సంప్రదించాలని, నాటు వైద్యులను సంప్రదించవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం పొందటం వలన మాతాశిశు మరణాలు నియంత్రించవచ్చని అన్నారు. తొమ్మిది నెలల గర్భకాలంలో కనీసం రెండు సార్లు స్కానింగ్ తప్పని సరిగా చేయించాలని సూచించారు. దీని వలన గర్భస్థ శిశువు పెరుగుదల తెలుసుకునేందుకు, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యాలు నిర్ధారించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా హాస్పిటల్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటళ్లలో ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ గురించి ఎటువంటి వాణిజ్య ప్రకటనలు చేయరాదని తెలిపారు. ఈ పరీక్షలు చేసిన వారికి, దానిని ప్రోత్సహించిన వారికీ మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. జిల్లాలో రిజిస్టర్ కాకుండా ఏ హాస్పిటల్, డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తే చట్టప్రకారం శిక్షార్హులవుతారన్నారు. ఇటువంటి వారి గురించి తెలిస్తే టోల్‌ఫ్రీ నంబరు 18004253365 ద్వారా తెలియజేయాలని ప్రజలకు సూచించారు. మెమో కె.సాంబశివరావు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయుని కల్యాణ వేడుకలు



పెండ్లి కుమారునిగా దర్శనమిస్తున్న సువర్చలా సహిత ప్రసన్నాంజనేయుడు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంతి, కల్యాణ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా సాగుతున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో గురువారం రెండో రోజు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణలను ఆలయ అర్చకులు బొర్రా వెంకట అనంతాచార్యులు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, మహిళలు స్వామి వారికి పొంగళ్లను చేసి, నైవేద్యాన్ని సమర్పించారు. స్వామి వారికి విశేష ఆకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసన్నాంజనేయుని మాలదారులకు గురుస్వామి వెంకట నరసింహాచార్యులు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం మహానివేదన, నీరాజనం, మంత్రపుష్పాన్ని స్వామివారికి సమర్పించారు. రాత్రి 7 గంటలకు శ్రీ సువర్చలా సహిత ప్రసన్నాంజనేయ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

యోగాపై అవగాహన పెంపునకు చర్యలు

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

గుంటూరు వెస్ట్: యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాలులో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించిన అధికారుల వీడియో సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. వచ్చే నెల 21వ తేదీ వరకు జరగనున్న యోగాంధ్ర క్యాంపెయిన్‌ను అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రతి మండల, డివిజనల్ స్థాయి కేంద్రాల్లోనూ యోగా మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో యోగా ప్రచారం విస్తృతంగా చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి మండల, గ్రామ, డివిజనల్ స్థాయిలో ట్రైనర్ల ద్వారా యోగా సాధన వల్ల వచ్చే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. గ్రామ, మండలాల్లో వంద నుంచి 150 మంది యోగా చేసేందుకు వీలున్న విద్యాసంస్థలు, గోదాములు, గుర్తించాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శుల ద్వారా యోగా సాధనకు పేర్లు నమోదు చేయించాలన్నారు. యోగాంధ్రలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకొక బృందాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాకు సంబంధించి కల్చరల్ టీం ఈ బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్



సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు దక్కినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి చెప్పారు. సాంబశివపేటలోని కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... 82 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన కళాశాల నాక్ నుంచి తాజాగా నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు దక్కించుకున్నట్లు వివరించారు. పేద, మధ్య తరగతి విద్యార్థినులకు ఆధునిక, సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. కాలానుగుణంగా ఉద్యోగం, ఉపాధి కల్పించే కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. స్వయంప్రతిపత్తి హోదా కలిగిన కళాశాల తాజాగా పొందిన నాక్ ఏ గ్రేడ్ గుర్తింపుతో మరో పదేళ్లపాటు స్వయం ప్రతిపత్తితో ముందుకు వెళుతుందని చెప్పారు. సంప్రదాయ డిగ్రీ కోర్సులతోపాటు ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సులకు తీసిపోని విధంగా వాటికి సమాంతరంగా బీఎస్సీలో డేటాసైన్స్, ఏఐ, బయోకెమిస్ట్రీ వంటి ఆధునిక కోర్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో నాక్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి. మధుసూదనరావు, అధ్యాపకులు ఎం. సంతోషికుమారి, కె. అపర్ణ సీతారామ్, కె. సుబ్బరత్నమ్మ, జి.శేషు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా పాయింట్లు పొందగోరు ఉపాధ్యాయులకు శుక్రవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రిఫరెన్షియల్, స్పెషల్ కేటగిరీ ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరానికి గత నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరై, సర్టిఫికెట్ పొందిన ఉపాధ్యాయులు హాజరు కానవసరం లేదని తెలిపారు. గత నెలలో నిర్వహించిన వైద్య శిబిరం తరువాత ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ మార్పిడి, ఎముకల క్షయ వ్యాధి, న్యూరో సర్జరీ, కేన్సర్ తదితర వ్యాధులకు గురైన వారితో పాటు ప్రస్తుతం హేతుబద్ధీకరణకు గురవుతున్న ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అర్హత గల ఉపాధ్యాయులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఉద్యోగ గుర్తింపు కార్డు తీసుకుని ఉదయం 9 గంటలకు జీజీహెచ్‌లో హాజరు కావాలని సూచించారు. గత నెలలో సర్టిఫికెట్ పొందిన వారు శుక్రవారం జరిగే శిబిరానికి హాజరు కానవసరం లేదని, హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టపగలే రూ.6.25 లక్షలు చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్సై డి.వెంకట కృష్ణ

సుద్దపల్లి (చేబ్రోలు): చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో పట్టపగలే ఇంటిలోని బీరువా తాళాలు పగలకొట్టిన దొంగలు భారీగా నగదు చోరీ చేసిన ఘటన గురువారం జరిగింది. సుద్దపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట శ్రీనుకు చెందిన ఇంటిలో మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోని బీరువా తాళాలు పగలకొట్టారు. అందులోని రూ.6.25 లక్షల నగదును చోరీ చేశారు. వీటితో పాటు బంగారు వస్తువులు కూడా చోరీ అయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం ఇంటిలో వివాహ వేడుక జరిగింది. వడ్లమూడిలో జరిగే శుభకార్యానికి అందరూ వెళ్లటంతో గమనించిన దొంగలు చోరీకి పాల్పడినట్లు తెలిసింది. పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై డి. వెంకట కృష్ణ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నంబాల ఎన్‌కౌంటర్ నాటకమే

ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్



సత్తెనపల్లి: మావోయిస్ట్ కీలక నేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారనేది నాటకమేనని ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నంబాల కేశవరావు మృతి చెందారనే వార్తను తాము నమ్మడం లేదన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత రోజుల తరబడి మృతదేహాలను మార్చురీలో పెట్టుకుని, అవి కుళ్లిపోయిన తరువాత ప్రధాన నాయకుడు చనిపోయాడని అంటున్నారని పేర్కొన్నారు. కానీ అవి ఆదివాసీలు, మిలీషియా సభ్యుల మృతదేహాలని వార్తలు వస్తున్నాయన్నారు. నంబాల చనిపోయారని చెబితే కేడర్ నిరాశ, నిస్పృహలతో ఉంటారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకం ఆడుతున్నాయని భావిస్తున్నామన్నారు. ఇలా ప్రజా ఉద్యమాలను అణచివేయాలనుకోవడం దురదృష్టకరమన్నారు. శాంతి చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాయుద్ధ నేతగా సజ్జా నాగేశ్వరరావు



నాగేశ్వరరావు (ఫైల్)

చీరాల: మావోయిస్టు పార్టీ మిలిటరీ విభాగంలో అవామ్–ఇ–జంగ్ ఎడిటోరియల్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సజ్జా నాగేశ్వరరావు అలియాస్ రాజన్న అలియాస్ ఏసన్న అలియాస్ నవీన్ నారాయణపూర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆయన స్వస్థలం బాపట్ల జిల్లా చీరాల మండలం జాండ్రపేట. జాండ్రపేటలో సాధారణ చేనేత కుటుంబంలో జన్మించిన ఆయన 36 సంవత్సరాలుగా విప్లవోద్యమంలో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు. బాల గంగాధరరావు, సుబ్బరావమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తండ్రి బాలగంగాధరరావు ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పలు ప్రాంతాలలో పనిచేశారు. రెండవ సంతానంగా నాగేశ్వరరావు జాండ్రపేట హైస్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి గుంటూరు జిల్లా నల్లపాడులోని పాలిటెక్నిక్ కాలేజీలో చదివారు. 17 ఏళ్ల వయస్సులోనే రాడికల్ విద్యార్థి సంఘం పరిచయంతో విప్లవోద్యంలోకి జీవితకాలం కార్యకర్తగా వెళ్లిన నాగేశ్వరరావు అరెస్ట్ అయి జైలు జీవితం గడిపారు. సోదరి వివాహానికి పెరోల్‌పై విడుదలైన ఆయన అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గుంటూరు జిల్లాలో జరిగిన ఉద్యమంలో నాగేశ్వరరావుకు ఏసన్నగా పేరుంది. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రజా యుద్ధ సైనికుడిగా నల్లమల, ఆంధ్ర ఒడిశా బోర్డర్ ప్రాంతంలో జరిగిన వివిధ పోరాటాలకు నాయకత్వం వహించారు. అప్పటి పీపుల్స్ వార్ నిర్వహించిన మిలటరీ పత్రిక జంగ్ సంపాదకునిగా వ్యవహరించారు. విస్తరించిన విప్లవోద్యమ అవసరాలలో భాగంగా ప్రస్తుత మావోయిస్ట్ పార్టీ మిలటరీ విభాగంలో అవామ్–ఇ–జంగ్ ఎడిటోరియల్ చీఫ్ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. నాగేశ్వరరావు మరణించారని మీడియాలో రావడంతో ఆయన సోదరుడు సజ్జా శ్రీనివాసరావు గురువారం మీడియాతో మాట్లాడారు. తమ్ముడి మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు కుటుంబ సభ్యుల సమక్షంలో చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వం కోరారు.

బంగారు గొలుసు స్నాచింగ్

పట్నంబజారు: మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కుని పరారైన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతావారి వీధిలో నివాసం ఉండే వై.సుజాత, నాగ సురేష్ దంపతులు కనుమూరి హాస్పిటల్ సమీపంలో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో సుజాత ఇంటికి వెళ్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి లాక్కొని పరారయ్యాడు. 32 గ్రాముల గొలుసు చోరీ అయినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ నర్సింగ్ (Girls), MLT, పెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలు హాస్టల్ వసతి కలదు. M.S.M. College, Guntur. 7386706839, 7780494333

SERVICES
BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937

GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ 8790741166

WANTED
■ గుంటూరులోని ఒక ప్రముఖ కార్పొరేట్ కాలేజీలో జూనియర్ లెక్చరర్స్ కావలెను. జీతం॥ 18000–25000 సంప్ర॥ 8398048889
■ Wanted Boys Kitchen helpers (11.00am to 4.30pm 6.30pm to 11.00pm) Steward Girls required. Contact: Arabic restarent, 3/1, Brodipet, Guntur. 9949977987
■ Wanted Lady Teacher to Teach Eng, Maths, soci for classes 3 to 7 fluency English Must. Cont: GKR HIGH SCHOOL PATTABHIPURAM 1 Line,Gnt. 9493765964
■ నల్లపాడు, కైలాసగిరి వద్ద వైభవ్ ఇండస్ట్రీస్ వారి ప్యాకేజ్డ్ & డ్రింకింగ్ వాటర్ బాటిల్స్ సప్లై చేయుటకు డీలర్స్/ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 94419 12776
■ మా సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లేడీస్ కావలెను. 10th పాస్/ ఫెయిల్ to PG, ఫోన్: 7330711162, 7386485962
■ Wanted faculty pre primary school mother teachers receptionist (Only Ladies) Contact: 7382320815
■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో వినుకొండ ఏరియాలోని వల్లభ డైరీ నందు 8 గం.లు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 95155 24430
■ Wanted Tele Calling Staff Only for Ladies. Qual: B.Tech, Salary: 10000 to 15000/- P.M. Preference: English & Hindi. Cont: 8019167291
■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు. కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.